క్లుప్తంగా

అర్బన్ హెల్త్ సెంటర్ తనిఖీ

చిత్తూరు రూరల్: నగరంలోని ప్రశాంత్‌నగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను శనివారం డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి రిజిస్టర్లు, సేవల అమలుతీరుపై పరిశీలించారు. అనంతరం ఇంటింటికీ ఆరోగ్యశ్రీ బ్రోచర్లు పంపిణీ చేశారు. ఆరోగ్య శ్రీ యాప్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎపిడిమాలజిస్ట్ శ్రీవాణి పాల్గొన్నారు.

నేషనల్ గేమ్స్‌కు కొటాల విద్యార్థిని


ఝాన్సీరాణి

యాదమరి: మహారాష్ట్రలోని నాసిక్‌లో ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్న నేషనల్ గేమ్స్‌కు కొటాల ఉన్నత పాఠశాల విద్యార్థిని ఝాన్సీరాణి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం యూసఫ్ తెలిపారు. గత నెలలో 17 నుంచి 19 వరకు కాకినాడలో జరిగిన అండర్ 17 రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన కొటాల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న ఝాన్సీరాణి ఎంపికైనట్లు వివరించారు.

ఏఆర్‌టీ కేంద్రం తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న వెంకటప్రసాద్

బంగారుపాళెం: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలోని లింక్ ఏఆర్‌టీ కేంద్రాన్ని శనివారం అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటప్రసాద్ తనిఖీ చేశారు. కేంద్రంలో పలు రికార్డును పరిశీలించారు. కేంద్రానికి ఎంత మంది వస్తున్నారు, మందులు ఎంతమంది తీసుకుంటున్నారు. ఎటువంటి సేవలు అందిస్తున్నారనే విషయాన్ని ఐసీటీసీ కౌన్సిల్ బాబును అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్షయ నివారణ కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు శిరీష, డీపీఎం మణి, సిబ్బంది పాల్గొన్నారు.

రాజేష్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలు


అన్నదానం చేస్తున్న డిప్యూటీ మేయర్

చిత్తూరు కార్పొరేషన్: నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఎస్.రాజేష్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం అట్టహాసంగా నిర్వహించారు. ఉదయం పొనియమ్మన్ గుడివీధిలోని వీరాంజనేయస్వామి, కొంగారెడ్డిపల్లెలోని సాయిబాబా ఆలయాల్లో అభిషేకం చేశారు. అనంతరం నగరపాలక సంస్థలోని డిప్యూటీ మేయర్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, అనధికారులు, మిత్రబృందం, శుభాకాంక్షలు తెలియజేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో కేక్‌లు కట్ చేశారు. తపోవనం వృద్ధాశ్రమంలో అన్నదానం చేసి, స్వెట్టర్లు, దుప్పట్లు అందజేయగా, శిశువిహార్‌లో పిల్లలకు మెడికల్స్ కిట్స్, స్వెటర్లు ఇచ్చారు. ప్రభుత్వ ఆస్పత్రి, వరిగిపల్లె, సంతపేటలో అన్నదానం చేశారు.

తుపానుపై అప్రమత్తం

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాకు తుపాను హెచ్చరిక ఉన్న నేపథ్యంలో విద్యుత్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు. శనివారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతు అయితే సకాలంలో ఎస్పీఎంకు పంపించి బాగు చేయించాలన్నారు. అలాగే కరెంటు స్తంభాలు, లైన్స్ తదితర విద్యుత్ పరికరాలు స్టోర్స్ నుంచి తెప్పించి సకాలంలో మార్చాలన్నారు. వినియోగదారులకు సమస్యలుంటే 1912 నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు.

తేనెటీగల దాడి

చిత్తూరు కార్పొరేషన్: నగరవనంలో వాకర్స్‌పై తేనెటీగలు దాడి చేసిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. వై జంక్షన్ సమీపంలో ఉన్న తేనెతుట్టెపై ఆకతాయిలు రాయి వేయడంతో తేనెటీగలు గుంపులు గుంపులుగా బయటకు వచ్చాయి. అదే సమయంలో వాకింగ్ చేస్తున్న వారిపై దాడి చేశాయి. సమాచారం అందుకున్న ఎఫ్ఆర్వో థామస్ సిబ్బందితో మంట పెట్టించడంతో ఆ పొగకు తేనెటీగలు వెళ్లిపోవడంతో వాకర్స్ ఊపిరిపీల్చుకున్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి

గుడిపాల: పాతకక్షల కారణంగా వ్యక్తిపై కత్తితో దాడి చేసిన సంఘటన మండలంలో శనివారం వెలుగుచూసింది. ఏఎస్ఐ మునివేలు కథనం మేరకు, కమ్మతిమ్మాపల్లె దళితవాడకు చెందిన శరవణ(29) అదే గ్రామంలోని జయవేలుకు పాతకక్షలు ఉన్నాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఇంటి వద్ద నుంచి పక్కనే ఉన్న చెరువు కట్ట వద్దకు వెళుతున్న శరవణపై జయవేలు కత్తితో దాడి చేశాడు. దీంతో శరవణ తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మునివేలు తెలిపారు. నిందితుడు జయవేలు ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, త్వరలోనే పట్టుకుంటామని ఆయన చెప్పారు.

నేడు మరో అవకాశం

- ఓటరుగా నమోదు చేసుకోండి
- తప్పులుంటే సవరించుకోండి
- కమిషనర్ అరుణ పిలుపు
- కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు శిబిరాలు




చిత్తూరు నగరంలో పోలింగ్ కేంద్రం తనిఖీ చేస్తున్న ఆర్డీవో చిన్నయ్య, కమిషనర్ అరుణ, పిల్లలతో కలిసి మధ్యాహ్న భోజనం తింటున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: ఓటరుగా నమోదు చేసుకోండి.. తప్పులుంటే సవరించుకోండి.. శనివారం మొదలైన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు నేడు కొనసాగుతాయంటూ చిత్తూరు మునిసిపల్ కమిషనర్ అరుణ తెలిపారు. సవరణలపై వచ్చే ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని, క్షేత్రస్థాయిలో విచారించి దస్త్రాలను జత చేయడంతో పాటు సంబంధిత వ్యక్తుల సంతకాలు తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆర్డీవో చిన్నయ్య, కమిషనర్ తదితరులు శనివారం నగరంలోని సంతపేట, కట్టమంచి, దొడ్డిపల్లి ప్రాంతాల్లోని పదికిపైగా పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి ప్రత్యేక ఓటు నమోదు అవగాహన కార్యక్రమాన్ని పరిశీలించి, బీఎల్ఓల వద్ద ఉన్న రికార్డులను తనిఖీ చేశారు. ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల ప్రకారం బీఎల్వోలు ఆదివారం నిర్దేశించిన సమయంలో పోలింగ్ కేంద్రంలో అందుబాటులో ఉంటూ ఓటరు నమోదు, సవరణలకు సంబంధించిన దరఖాస్తులను సేకరించాలన్నారు. ఓటరు నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరబాట్లకు తావివ్వకూడదన్నారు. కమిషనర్ వెంట సహాయ కమిషనర్ గోవర్ధన్, ఏసీపీ రామకృష్ణుడు, సీఎంఎం గోపి తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రంలోనే ఉండాలి

ప్రత్యేక ఓటర్ల నమోదు అవగాహన రోజుల్లో సంబంధిత బీఎల్వోలు వారి పోలింగ్ కేంద్రంలో నిర్దేశించిన సమయంలో కచ్చితంగా అందుబాటులో ఉండాలని ఆర్డీవో చిన్నయ్య, కమిషనర్ అరుణ ఆదేశించారు. సూపర్‌వైజర్ అధికారులు, బీఎల్‌వోలతో మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ, ఓటర్ల జాబితా ప్రత్యేక ముసాదా సవరణ -2024 కార్యక్రమంలో భాగంగా తప్పులు లేని ఓటర్ల జాబితా తయారీకి చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. ఫారం-7 విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని మరణించిన, వివాహమై వెళ్లిపోయిన, శాశ్వతంగా వలస వెళ్లిన వారిని గుర్తించి ఫారం-బి జారీ చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష పరిశీలన చేయడంతోపాటు, సంబంధిత దస్త్రాలను సంతకాలతో సహా సేకరించాలన్నారు. అవగాహన కార్యక్రమంలో భాగంగా అందే దరఖాస్తులను క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేసి అప్లోడ్ చేయాలన్నారు. రాష్ట్రస్థాయి ఓటర్ల జాబితా పరిశీలకులు క్షేత్రస్థాయి పరిశీలనకు వస్తున్నారని, ఎలాంటి పొరబాట్లకు తావు లేకుండా నిబంధనల ప్రకారం అన్ని దరఖాస్తులు వాటికి సంబంధించిన దస్త్రాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన

చిత్తూరు నగరంలో ఇటీవల ఓ మోస్తరు వర్షం పడుతుండడంతో అధికారులు, యంత్రాంగం క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని మునిసిపల్ కమిషనర్ అరుణ చెప్పారు. కమిషనర్ శనివారం సాయంత్రం నగరంలోని తేనబండ రోడ్డు వంతెన, వీరభద్ర కాలనీ, నీవానది కల్వర్టు తదితర లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. ఆ ప్రాంతాల్లో వర్షపు నీరు నిలవకుండా తగిన ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. నీవా నదిలో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూడాలన్నారు. వర్షాల నేపథ్యంలో ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగం అధికారులు ప్రత్యేక అత్యవసర బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. విభాగాధిపతులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిస్థితి అంచనా వేసుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజనీరు గోమతి, ప్రజారోగ్యశాఖ అధికారి లోకేష్, డీఈ వెంకటప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, నరసింహ, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు. మరోవైపు వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఏదైనా ఇబ్బందులు ఎదురైతే చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేస్తే (9849907885, 08572232745) వెంటనే స్పందిస్తామన్నారు.

మధ్యాహ్నం భోజనం తనిఖీ

నగరంలోని కట్టమంచి మునిసిపల్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని నగర కమిషనర్ అరుణ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని విద్యార్థులకు అందించిన మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో కలిసి రుచి చూశారు. అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కమిషనర్ పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడారు. రానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేలా ఇప్పటి నుంచే ప్రణాళిక ప్రకారం విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. పరీక్షలు అంటే ఉన్న భయాన్ని తొలగించాలని, చదువులో వెనుకబడిన విద్యార్థులను తగిన విధంగా ప్రోత్సహించి ఉత్తీర్ణత సాధించేలా శిక్షణ ఇవ్వాలన్నారు. పాఠశాల హెచ్‌ఎం రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణనాథుని సేవలో కర్ణాటక న్యాయమూర్తి


జడ్జికి చిత్రపటం అందజేస్తున్న ఆలయ చైర్మన్

కాణిపాకం (యాదమరి): వరసిద్ధి వినాయక స్వామివారిని కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కేవీ అరవింద్ శనివారం దర్శించుకున్నారు. ఉదయం ఆయన కుటుంబ సమేతంగా స్వామి వారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికి, స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, సూపరింటెండెంట్ వాసు, ఇన్‌స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

నేడు యూటీఎఫ్ సమావేశం

చిత్తూరు కలెక్టరేట్ : యూటీఎఫ్ 48వ జిల్లా కౌన్సిల్ సమావేశం ఆదివారం జిల్లా కేంద్రంలోని పుత్తూరు రోడ్డులో ఉన్న విజయం విద్యాసంస్థల్లో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖరనాయుడు, జీవీ రమణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బీమా నగదు అందజేత

చిత్తూరు రూరల్: ఏనుగుల దాడిలో మృతి చెందిన గుడిపాల మండలం 190 రామాపురానికి చెందిన దంపతులకు శనివారం సప్తగిరి గ్రామీణ బ్యాంకు అధికారులు రూ.5లక్షల బీమా చెక్‌ను అందజేశారు.

రైతులకు భూహక్కు కల్పనే ధ్యేయం


రైతులకు భూ హక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాబు, జేసీ శ్రీనివాసులు, నాయకులు

బంగారుపాళెం: భూమిలేని రైతులకు భూ హక్కు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. బంగారుపాళెంలోని ఎస్ఎల్‌వీ కల్యాణ మండపంలో శనివారం సాయంత్రం నియోజకవర్గంలోని రైతులకు భూ హక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. భూ పంపిణీ కార్యక్రమంలో భాగంగా భూమిలేని రైతులకు భూ పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు సంక్షేమానికి పాటుపడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసిన భూములను రైతులు సాగు చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ, పూతలపట్టు నియోజకవర్గంలో 750 మంది రైతులకు 850 ఎకరాలు పంపిణీ చేసి హక్కు పత్రాలను అందజేసినట్లు తెలిపారు. బంగారుపాళెం మండలానికి సంబంధించి 525 మంది రైతులకు గాను 611.80 ఎకరాలు పంపిణీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర పాల ఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, జెడ్పీటీసీ సభ్యులు సోమశేఖర్, భారతి, పలమనేరు, చిత్తూరు ఆర్డీఓలు మనోజ్‌కుమార్‌రెడ్డి, చిన్నయ్య, తహసీల్దార్లు అనీల్‌కుమార్, హనుమంతప్ప, సుశీల, విజయభాస్కర్, గుణశేఖర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు జవాబుదారీగా పనిచేయండి

ఐరాల: ప్రభుత్వ అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండి అంకితభావంతో విధులు నిర్వర్తించాలని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు సూచించారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో శనివారం ఎంపీపీ మోహన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడు నెలలకు ఒకసారి జరిగే మండల మీట్‌కు 14 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా 9 మంది హాజరుకావడంతో అసహనం వ్యక్తం చేశారు. సమావేశానికి హాజరుకాని సభ్యులకు నోటీసులు జారీ చేసి, జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేయాలని ఎంపీడీఓ నాగరాజును ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి జగనన్న లే అవుట్లలో చేపట్టిన గృహనిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ ఏఈ గుణశేఖర్‌రెడ్డికి ఆదేశించారు. జగనన్న కాలనీల్లో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి డిసెంబర్ చివరికి ఇంటి నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. మండలంలో విద్యుత్ శాఖ ఉద్యోగుల పనితీరు రోజురోజుకూ దిగజారిపోతుందని, వీరి వల్ల ప్రజల్లో ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు చెడ్డ పేరు వస్తుందని ఐరాల ఏఈ చలపతి, మద్దిపట్లపల్లె ఏఈ బాలాజీపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయా గ్రామస్తులు తక్కువ ఎత్తులో ఉన్న కరెంట్ తీగలను మార్చాలని, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తిని పట్టించుకోకపోతే ఎలా అని ప్రశ్నించారు. పది రోజుల వ్యవధిలో పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ పనులు పకడ్బందీగా చేపట్టాలని ఏపీఓ సంధ్యను ఆదేశించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్ర మంలో వైస్ ఎంపీపీలు నిత్య, రోజా, కో-ఆప్షన్ మెంబర్ హారూన్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యు లు, మండల అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి


జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

గుడిపాల: జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా బాల్యవివాహాలను అరికట్టాలని ఇందిరాక్రాంతి ఏపీయం సుధారాణి అన్నారు. బాల్యవివాహాల అరికట్టాలనే అంశంపై శనివారం మండల సమాఖ్యలో మహిళలకు, సంఘమిత్రలతో ప్రతిజ్ఞ చేయించారు. ఆమె మాట్లాడుతూ డిసెంబర్ 22 వరకు గ్రామ సమాఖ్య పరిధిలో బాల్యవివాహాలు, రక్తహీనత, బాలికా విద్య మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు లోకనాథరెడ్డి, హేమచంద్రారెడ్డి, మల్లీశ్వరి పాల్గొన్నారు.

వేగవంతం చేయండి

గుడిపాల: ఇంటి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ గురురాజన్ అన్నారు. మండలంలోని పశుమంద లేఔట్‌లతో శనివారం నిర్మిస్తున్న ఇంటి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆ ఇళ్ల నిర్మాణాలన్నింటినీ లబ్ధిదారులతో మాట్లాడి వేగవంతం చేయాలన్నారు. ఇంటి నిర్మాణంతో పాటు ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను, ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. లేఅవుట్లలో ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతను తప్పనిసరిగా చేయించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందుకు గాను నిధులను కూడా ప్రభుత్వమే ఇవ్వనున్నట్లు చెప్పారు. ఏఈ గణేష్, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ ధనంజయలు పాల్గొన్నారు.


నిర్మాణాలను పరిశీలిస్తున్న డీఈ గురురాజన్

ఆస్పత్రి నిర్వహణ ప్రభుత్వంతోనే సాధ్యం


సూపరింటెండెంట్‌కు విన్నవిస్తున్న సీపీఐ నాయకులు

చిత్తూరు రూరల్: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నిర్వహణ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు స్పష్టం చేశారు. నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట సీపీఐ నాయకులు శనివారం ధర్నా చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగితేనే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని చెప్పారు. అన్ని విభాగాల్లో నైపుణ్యం కలిగిన ప్రభుత్వ డాక్టర్లను నియమించాలన్నారు. టీడీపీ ప్రభుత్వం అపోలో యజమాన్యానికి 33 సంవత్సరాల పాటు లీజుకు ఇస్తే, ఆస్పత్రిలో సరైన వైద్యం అందడం లేదన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో పూర్తి బాధ్యతలు అపోలోకు అప్పగిస్తే నిరుపేదలకు అందుతున్న ఆ కాస్త వైద్యం కూడా దూరమవుతుందన్నారు. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని వారు పేర్కొన్నారు. అనంతరం సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గోపినాథ్, మణి, దాసరి చంద్ర, ఆరుముగం, రమాదేవి, రఘు, గజేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

యాదమరి: లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం అని స్థానిక వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ అన్నారు. మండలంలోని ఆరిమాకులపల్లె ఆరోగ్య ఉపకేంద్రంలో శనివారం వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం పరిశీలించారు. అనంతరం ఆస్పత్రి సిబ్బందికి సమావేశం నిర్వహించారు. మండల పరిధిలో మగ పిల్లల కంటే ఆడ పిల్లల సంతతి తక్కువగా ఉందన్నారు. దీనిపై సిబ్బంది గ్రామాల్లో గర్భవతులకు లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించరాదన్నారు. ఎవరైనా లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు తెలిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. క్రమం తప్పకుండా టీకాలు వేయాలని సూచించారు.


టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న వైద్యులు

రేపు పట్నంలో గడప గడపకు మన ప్రభుత్వం

తవణంపల్లె: మండలంలోని పట్నం సచివాలయం పరిధిలోని గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం పూతలపట్టు ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తారని వివరించారు. కార్యక్రమానికి మండలంలోని ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అన్ని శాఖల అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పేరయ్యగారిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్


గుడిపాల: వైద్యసేవలందిస్తున్న డాక్టర్ సంధ్య

ఐరాల: మండలంలోని పేరయ్యగారిపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత 104 వాహనంలో 80 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

తవణంపల్లె: గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ ధాత్రేయచౌదరి తెలిపారు. మండలంలోని టి.పుత్తూరు సచివాలయంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్య శిబిరంలో డాక్టర్ ధాత్రేయచౌదరి 47 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం గర్భవతులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ నిర్మల, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ పావని, ఆశావర్కర్లు నాగభూషణం, సౌందర్య, పుష్ప పాల్గొన్నారు.

ఇంటి వద్దనే వైద్య సేవలు

గుడిపాల: ఇళ్ల వద్దనే వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని తీసుకొచ్చిందని వైద్యాధికారి సంధ్య తెలిపారు. మండలంలోని బసవాపల్లెలో శనివారం డాక్టర్ సంధ్య ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు స్థానికులకు వైద్యసేవలు అందించారు. బీపీ, షుగర్, జ్వరం, ఇతర చిన్న జబ్బులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో సిబ్బంది రోస్‌లిన్, చంద్ర, కోమల, పంకజ పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత, తవణంపల్లె: పరీక్షలు చేస్తున్న డాక్టర్ ధాత్రేయచౌదరి

ఓటర్ల నమోదుకు ప్రత్యేక శిబిరాలు


తవణంపల్లె: ర్యాలీ చేస్తున్న ఎన్నికల సెక్టోరియల్ అధికారి హేమలత, బీఎల్వోలు


పూతలపట్టు: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి జాన్‌విక్టర్


యాదమరి: బీఎల్‌వో కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈఆర్‌ఓ శివయ్య

పూతలపట్టు: కలెక్టర్ ఆదేశాల మేరకు ఓటరు నమోదుకు శనివారం మండలంలో 42 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలను తహసీల్దార్ విజయభాస్కర్ ఏర్పాటు చేశారు. శిబిరానికి ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు వచ్చింది. తొలిరోజున మండలంలో 221 మంది కొత్తగా ఓటరు నమోదు చేసుకున్నారు. మండలంలోని శిబిరాలను మండల ప్రత్యేకాధికారి జాన్‌విక్టర్ పరిశీలించారు. వారు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల పరిధిలోని 18 ఏళ్లు నిండిన వారు తప్పక ఫారం-6 నమోదు చేసుకోవాలని సూచించారు. బీఎల్‌ఓలు ప్రజలకు అవగాహన కల్పించి ఓటరు నమోదు ప్రక్రియను పూర్తిచేయాలని సూచించారు. తహసీల్దార్ విజయభాస్కర్, ఎన్నికల డీటీ మహేశ్వరి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

206 అభ్యంతరాల స్వీకరణ

తవణంపల్లె: మండలంలోని 56 పోలింగ్ కేంద్రాల్లో 205 అభ్యంతరాలు స్వీకరించినట్లు తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి తెలిపారు. మండలంలో కొత్త ఓటర్ల నమోదు ఫారం 6 క్లైయిమ్‌లు 65, ఓటర్ల జాబితాలో తొలగింపుల కోసం ఫారం 7 క్లైమ్‌లు 74, సవరణ కోసం ఫారం 8 క్లైయిమ్‌లు 67 వచ్చినట్లు వివరించారు. ఆదివారం కూడా బీఎల్వోలు క్లైమ్‌లు స్వీకరిస్తారని వివరించారు.

ఓటర్ల నమోదు వేగవంతం చేయాలి

నూతన ఓటర్ల నమోదును బీఎల్వోలు వేగవంతం చేయాలని మండల ఎన్నికల సెక్టోరియల్ అధికారి, ఎంఈఓ హేమలత తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శనివారం ఓటర్ల నమోదు కోసం ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలోని ఉత్తరబ్రాహ్మణపల్లె, పుణ్యసముద్రం, సంతపల్లె పోలింగ్ కేంద్రాల్లో నూతన ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ హనుమంతు

ఓటర్ల నమోదుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఎల్వోలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండు రోజుల పాటు ప్రత్యేక ఓటర్ల శిబిరం

యాదమరి: మండల పరిధిలో ఇప్పటి వరకు ఓటు హక్కు నమోదు చేసుకోని వారు తమ ఓటు హక్కులను రెండు రోజుల్లో నమోదు చేసుకోవాలని ఈఆర్‌ఓ శివయ్య కోరారు. శనివారం ఆయన మండలంలోని పలు బిఎల్‌ఓ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం బిఎల్‌ఓలకు, మండల స్థాయి అధికారులకు తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. రెండు రోజుల పాటు బిఎల్‌ఓలు పోలింగ్ కేంద్రాల వద్ద ఉండాలని గ్రామాలలో ఎవ్వరైన చనిపోయి ఉంటే వారి బంధువుల వద్ద ఫారం 7లో వివరాలు నింపి రద్దు చేయాలన్నారు. కొత్త ఓటర్లు ఫారం 8లో వివరాలు నింపి నమోదు చేయాలని కోరారు. తప్పులు తడకలుగా చేస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హనుమంతు, మండల రెవెన్యూ అధికారులు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.